సాక్షి చిత్తూరు

శుక్రవారం । 10 । నవంబర్ । 2023



300 ఫోన్లు స్వాధీనం

జిల్లా పోలీసు శాఖ రూ.60 లక్షల విలువ చేసే 300 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ సుధాకర్ తెలిపారు. - 2లో



వేదకాల వైద్యం ఆయుర్వేదం

వేదకాలం నుంచి ఆయుర్వేదం ప్రాచుర్యంలో ఉంది. నేడు ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. - 2లో



విధుల్లో నిర్లక్ష్యంపై ఆగ్రహం

విధుల్లో నిర్లక్ష్యం వహించిన పోలవరం హైస్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయుడికి డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. - 2లో

న్యూస్‌రీల్

సాఫ్ట్‌వేర్‌కు దిక్సూచి భారత్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

నగరి : భారతదేశం సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచానికి దిక్సూచిగా ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కెరీర్ గైడెన్స్ విభాగం, టేక్ ఆఫ్ ఎడ్యూ గ్రూప్, తిరుపతి వారు సంయుక్తంగా నిర్వహించిన 'సాఫ్ట్ వేర్ కోర్సులు -అవకాశాలు' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం మానవ వనరులను అందించే కల్పతరువుగా మారిందన్నారు. కంప్యూటర్ చేత ప్రభావితం కాని రంగం ప్రపంచంలో లేదని, సాఫ్ట్‌వేర్ రంగం ఎప్పటికి ఉపాధి కల్పించే రంగమన్నారు. సర్టిఫికెట్‌తోపాటు, అనుభవపూర్వకంగా నేర్చుకోవాలని సూచించారు.పైథాన్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి నూతన కంప్యూటర్ ప్రోగ్రామ్స్ నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.భాస్కర రాజు, కెరీర్ గైడెన్స్ కో-ఆర్డినేటర్ డా.రేవతి, ఐక్యూ కో-ఆర్డినేటర్ డా.ఇందిరా ప్రియదర్శిని, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డా.భాస్కర్, జేకేసీ మెంటార్ లాల్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుధ పూజ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా అటవీశాఖ, వెస్ట్ ఎఫ్ఆర్వో కార్యాలయాల్లో గురువారం ఆయుధ పూజ నిర్వహించారు. దుర్గాదేవి చిత్రపటానికి డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి, ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి పూజలు చేశారు. అనంతరం సిబ్బందికి స్వీట్లు పంచిపెట్టారు. ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ, నగర డీఈ, క్యాష్, ఏడీఎం సెక్షన్లలో ఆయుధ పూజ చేసి స్వీట్లు సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఈఈ పద్మనాభపిళ్లై, డీఈ శేషాద్రి సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువలా వరసిద్ధుని కల్యాణోత్సవం



మాంగల్యం చూపుతున్న వేదపండితులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి కల్యాణోత్సవాన్ని పాలకొల్లులో కనుల పండువలా నిర్వహించారు. కాణిపాక దేవాలయం, ధర్మప్రచార పరిషత్, సేవ్ టెంపుల్స్ భారత ఆర్గనైజేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో పాలకొల్లులోని క్షత్రియ కల్యాణ మండపంలో గురువారం ఉదయం శాస్త్రోక్తంగా గణపతి హోమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, కల్యాణ మండపంలోని పెళ్లి పందిరిలో దేవదేవేరులను అలంకరించి కొలువుదీర్చారు. అనంతరం వేద మంత్రాల మధ్య స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువలా సాగింది. ఈ కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి దంపతులు, ఈఓ వెంకటేశు, సేవ్ టెంపుల్స్ భారత ఆర్గనైజేషన్ సభ్యులు గజల్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ శేషుబాబు, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ఆలయ వేద పండితులు పాల్గొన్నారు.

న్యాయసేవలు మరింత సులభతరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్

చిత్తూరు అర్బన్: ప్రజలందరికీ సమానమైన, సులభతరమైన న్యాయ సేవలను అందించడం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్ తెలిపారు. న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నగరపాలక కార్యాలయంలో న్యాయ సదస్సుల నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కరుణకుమార్ మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రకారం ప్రజలందరికీ సమాన న్యాయం, ఉచిత న్యాయ సహాయం అందించాలని లక్ష్యంతో న్యాయ సేవాధికార సంస్థ చట్టం రూపొందించినట్లు తెలిపారు. 1995 నవంబర్ 9న ఈ చట్టం అమల్లోకి వచ్చిన సందర్భంగా ప్రతి ఏటా ఇదే రోజున న్యాయ సేవా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. నగరపాలక సంస్థతో కలసి ఇదివరకే అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో చిన్నయ్య, కమిషనర్ జె అరుణ, సహాయ కమిషనర్ గోవర్ధన్, ఏఎస్వో సౌందర్ రాజన్, సీఎంఎం గోపి, బీఎల్వోలు పాల్గొన్నారు.



నది సంద్రంలో వేటాడుతున్న జాలర్లు





వేట ముగించుకుని ఒడ్డుకు చేరుకుంటున్న మత్స్యకారులు

జీవన సంద్రం

బతుకుదెరువు కోసం ప్రాణాలనే పణంగా పెడతారు. చూస్తేనే భయమేసే సముద్రాన్నే తమ జీవనయానానికి ఆదరవుగా మలుచుకుంటారు. కుటుంబాలను వదిలి కారుచీకట్లోనే కదలిపైకి వేటకు బయలుదేరుతారు. ఉవ్వెత్తున ఎగసిపడే అలలను అలవోకగా దాటుకుంటూ మత్స్య సంపద కోసం అన్వేషణ మొదలుపెడతారు. అదృష్ట దేవత వరిస్తే సంతోషంతో ఉప్పొంగిపోతారు. దురదృష్టం వెంటాడితే కన్నీటి కదలితో కుమిలిపోతారు. అనుకోని ఉపద్రవం వస్తే ప్రాణాలకు ఎదురొడ్డి పోరాటాన్ని కొనసాగిస్తారు. తమ కులదైవంపైనే భారమేసి క్షణమొక యుగంలా గడుపుతూ తీరానికి చేరుకుంటారు. అప్పటిదాకా తమరాక కోసం ఎదురుచూసిన కుటుంబ సభ్యులను చూసి కళ్లల్లో సుడులు తిరుగుతున్న ఆనందబాష్పాలతో హత్తుకుని ఎగిరిగంతేస్తారు. బతుకు పోరాటంలో గంగపుత్రుల జీవన శైలిపై ఓసారి లుక్కేద్దాం!

- మత్స్యకారుల జీవనశైలి విభిన్నం
- వేట విరామంలో ఊరంతా నందడి
- వైఎస్సార్‌సీపీ హయాంలో పెరిగిన మత్స్యకారుల జీవన ప్రమాణాలు
- బిడ్డల చదువులపై శ్రద్ధ చూపుతున్న తల్లిదండ్రులు



వేటకు బయలుదేరుతూ..

సాక్షి, తిరుపతి డెస్క్: తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల పరిధిలో 12 మండలాలు ఉండగా.. వాటి పరిధిలో 169 కి.మీ.మేర సముద్ర తీరం ఉంది. ఆ తీరం వెంబడి ఉన్న 98 గ్రామాల్లో సుమారు 1.5 లక్షల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. ఇందులో దాదాపు 41 వేల మంది చేపల వేటనే జీవనాధారంగా మార్చుకున్నారు. ఏటా దాదాపు 65 వేల టన్నుల మత్స్య సంపదను సముద్రం నుంచి సేకరిస్తున్నారు. గంగపుత్రుల జీవన శైలి విభిన్నం.. సాహసోపేతంగా ఉంటోంది. గ్రామ పెద్దల కనుసన్నల్లో కట్టుబాట్లను ఆచరిస్తూ జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. కష్టాన్నే నమ్ముకుని కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. అర్ధరాత్రి నుంచి వీరి దినచర్యను ప్రారంభిస్తారు. వేకువ జామున 2 గంటలకే సిద్ధం చేసుకున్న వలలను భుజాన వేసుకుని సంప్రదాయ బోట్ల ద్వారా సముద్రంలోకి వెళ్తారు. దాదాపు 5 కి.మీ.సముద్రంలోకి వెళ్లి వలలు వేసి మత్స్య సంపదను సేకరించి ఉదయం తీరానికి చేరుకుంటారు. మెకనైజ్డ్ బోట్లు ఉన్న మత్స్యకారులు మాత్రం సముద్రంలో వారం పాటు ఉండి మత్స్య సంపదను సేకరించి వస్తారు. ఇలా పది నెలల పాటు ఎన్నో ఆటుపోట్లతో కుటుంబాలను పోషించుకుంటారు. పగలంతా తమ వలలను సరిచేసుకుని మళ్లీ మరుసటి రోజుకు సన్నద్ధమవుతారు. కుటుంబ సభ్యులతో గడిపేది చాలా తక్కువ. ఇలా ఏడాదిలో పది నెలలు సముద్రంలోనే వీరి జీవితం గడిచిపోతుంది.

దురాయి.. ఎంతో మేలోయి!

మత్స్యకారులు కులాల కుంపట్లకు.. రాజకీయాలకు దూరం. అందరిదీ ఒక్కటే మాట.. బాట. ఒక్క మాటలో చెప్పాలంటే.. తమకు తాముగా విధించుకున్న కట్టుబాట్లకు కట్టుబానిసలు. తప్పొప్పులు జరిగితే పరిష్కరించేందుకు వీరు పోలీస్‌స్టేషన్ల మెట్లు ఎక్కేది తక్కువ. వీరికి వీరు సృష్టించుకున్న చట్టం పేరు 'దురాయి'. ఈ చట్టం కట్టుబాటును ఎవరూ ధిక్కరించరు. పెద్ద కాపు, నడింకాపు, చిన్నకాపు.. ఇలా ఊరిలో ముగ్గురిని గ్రామ పెద్దలుగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటారు. వీరు చెప్పిందే వేదం. చేసిన తప్పులకు వీరే శిక్ష వేస్తారు. ఎవరైనా ఈ నిర్ణయాన్ని ధిక్కరిస్తే.. అందరికీ ఆమోదయోగ్యంగా 'దురాయి' విధిస్తారు. తమకు మంచిచేసే వారి కోసం ప్రాణాలైనా ఇచ్చేస్తారు. తమకు అన్యాయం చేస్తే అందరూ ఒక్కటవుతారు. వీరిలో దైవభక్తి కూడా ఎక్కువే.

వేటకు విరామం.. బతుకు పోరాటం

వేట విరామ సమయంలో మత్స్యకారులు కాయకష్టాన్నే నమ్ముకుంటారు. కొంతమంది అందుబాటులో ఉన్న ఆక్వా కల్చర్‌లో కూలిపనులకు వెళ్లగా మరికొందరు రొయ్యల చెరువుల్లో పనిచేయడం, ప్యాకింగ్ చేయడం, ఇతరత్రా పనులకు వెళ్తారు. ఆయా పనులు దొరకని పక్షంలో కాలక్షేపం కోసం చింతబెత్తలతో ఆట, పులీమేక, కబడ్డీ ఆడుతుంటారు. వేసవిలో చెట్ల నీడలోనే ఎక్కువ సమయం గడుపుతారు. మహిళలైతే ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు.



బతుకు 'వేట'

గ్రామంలో మత్స్యకారులు బోటు సామర్థ్యాన్ని బట్టి యూనిట్‌గా ఏర్పాటవుతారు. పెద్దబోటులో (మూడు ఇంజిన్లు) 30 మంది, సింగిల్ ఇంజిన్ ఉన్న బోటులో నలుగురు వెళ్తారు. డబుల్ ఇంజిన్ ఉన్న బోటులో 20 మందికి పైగా వేటకు వెళ్తారు. వారు సేకరించే మత్స్య సంపదను అందరూ కలిసి పంచుకుంటారు. ఒకసారి వేటకు వెళ్తే బోటు డీజిల్ ఇతరత్రా రూ.15 వేల వరకు ఖర్చవుతుంది. ఆయా బోట్లు, వలలు మరమ్మతులకు గురైతే ఆ యూనిట్‌లో ఉన్న వారందరూ కలిసి అప్పులు చేసి బాగు చేయించుకుంటారు. అవసరమైతే గ్రామం మొత్తం మీద అప్పు తెచ్చుకుంటారు.



నాలుగున్నరేళ్లలో ఎంతో మార్పు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత్స్యకారుల జీవితాల్లో పెనుమార్పులు సంభవించాయి. అమ్మఒడి, రైతుభరోసా, వైఎస్సార్ సామాజిక పింఛన్, డ్వాక్రా రుణాల మాఫీ, వడ్డీ రీయింబర్స్‌మెంట్‌తో పాటు వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత.. ఇలా ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హతగల కుటుంబాలన్నింటికీ ఎలాంటి వివక్ష లేకుండా అందజేస్తోంది. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు సముద్రంలో చేపల పునరుత్పత్తి జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వేటకు విరామం ప్రకటిస్తూ, నిషేధం విధించింది. ఆ సమయంలో జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తోంది. అదే గతంలో అయితే అరకొర మందికి.. అదీ ఏడాదికి రూ.4 వేలు ఆర్థిక సాయం, 20 కేజీల బియ్యం ఇచ్చేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బోట్లకు డీజిల్ సబ్సిడీని గణనీయంగా పెంచింది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే రూ.10 లక్షలు పరిహారం అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా రూ.3.3 లక్షల విలువైన బోటు, మోటార్లు, వలలు రాయితీపై అందిస్తోంది. మెకనైజ్డ్ బోట్ల పంపిణీకి కూడా రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేస్తోంది.

ఈ ప్రభుత్వంలో జీవనం సుభిక్షం



గతంలో మత్స్యకార భరోసా సకాలంలో రాక జీవనానికి మావాళ్లు నానా అవస్థలు పడేవారు. ప్రమాదాలు జరిగినపుడు ప్రమాద బీమా కూడా అందక చాలా కుటుంబాలు వీధిన పడ్డాయి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత్స్యకారులకు భరోసా దొరికింది. అనేక పనిముట్లపై రాయితీలు ఇచ్చింది. సకాలంలో వేట విరామం నగదు, డీజిల్‌పై సబ్సిడీ, బోట్లపై 90 శాతం రాయితీలు తదితర సంక్షేమ పథకాలతో మత్స్యకారుల జీవనం సుభిక్షంగా ఉంది.

– వాటంగారి వెంకట్రమణయ్య, మత్స్యకార సంఘం నాయకుడు, వైస్ ఎంపీపీ, తూపిలిపాళెం



మత్స్య సంపదను చూపుతున్న జాలరి



చేపల విక్రయానికి బయలుదేరుతున్న మత్స్యకార కుటుంబ సభ్యులు



ఎండబెట్టిన చేపలు

ఆ సమయంలో చాలా భయమేసింది



ఎనిమిదేళ్ల కిందట వచ్చిన హుద్‌హుద్ తుపాన్ సమయంలో నేను మరో నలుగురు మత్స్యకారులతో కలిసి 20 నాటికల్ మైళ్ల దూరంలో సముద్రంపై వేట సాగిస్తున్నాం. ఆ సమయంలో ఒక్కసారిగా సముద్రంలో ఏర్పడిన సుడులతో చాలా భయాందోళన చెందాం. త్వరగా ఒడ్డుకు చేరుకోవాలని అధికారులు, మత్స్యకార కాపులు ఫోన్లు చేసి సూచించారు. కానీ ఎటూ కదలలేక తిరగబడుతున్న బోట్లతో వణికిపోయాం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చాలా సేపు గడిపాం. ఇకచేసేది లేక మా ఇష్ట దైవాన్ని తలచుకుంటూ ఎలాగోల ఒడ్డుకు చేరుకున్నాడు.

– కొండూరు సోమయ్య, తూపిలిపాళెం

చేపల వేట తప్ప మరేపనీ తెలియదు



నేను గత 25 ఏళ్ల నుంచి సముద్రంలో చేపల వేటకు వెళుతున్నాను. ఈ వృత్తి మా తాతల తరాల నుంచి వస్తోంది. నాకు వేరే పని తెలియదు. మేం ప్రతిరోజు అర్ధరాత్రి సమయంలో భార్య, పిల్లలను వదిలేసి సముద్రంలోకి వెళ్లి రోజంతా గాలించి తెచ్చిన మత్స్య సంపదతో పొట్టపోసుకుంటున్నాం. ఎక్కువ మోతాదులో మత్స్య సంపద దొరికినప్పుడు గ్రామ కట్టుబాట్లకు అనుగుణంగా వేలం ద్వారా పొరుగు రాష్ట్రాల వ్యాపారులకు విక్రయిస్తాం. వచ్చిన మొత్తాన్ని 5 మంది మత్స్యకారులు సమానంగా తీసుకుంటాం. అయితే ఒక్కోసారి నెల రోజులైనా సముద్రంపై గాలించినప్పటికీ చేపలు దొరక్క పస్తులు ఉండాల్సి వస్తుంది.

– ఎం.పోలయ్య, కొండూరుపాళెం గ్రామం

మాటకు కట్టుబడి ఉంటాం



సముద్రంపై ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదురొడ్డి వేట చేయడం సంప్రదాయ మత్స్యకారుల లక్ష్యం. మేమంతా గ్రామ కట్టుబాట్లుకు లోబడి ఉంటాం. గ్రామంలో ఎంత పెద్ద సమస్య తలెత్తినా పోలీస్‌స్టేషన్‌కు పోకుండా గ్రామ పెద్దల ద్వారానే పరిష్కరించుకుంటాం. ఈ ఆనవాయితీ తరతరాల నుంచి వస్తోంది. గ్రామ కట్టుబాట్లను ధిక్కరించిన వారిని అపరాధ రుసుం విధించి మందలిస్తాం. చేపల వేటలో ఎదైనా సమస్య ఉంటే వెంటనే గ్రామంలో దురాయి విధిస్తాం. దానిని అందరూ తప్పక పాటించాల్సిందే.

– ఆర్కేటి గోపాలయ్య, మాజీ పెద్ద కాపు, తూపిలిపాళెం.

ఆ సమయంలో దిక్కుతోచదు



మా ఆయన అర్ధరాత్రి సమయంలో నన్ను, మా పిల్లల్ని వదిలి చేపలవేటకు సముద్రంలోకి వెళతారు. ఆ సమయంలో నేను సముద్రం ఒడ్డు వరకు వెళ్లి సాగనంపి వస్తాను. పిల్లల్ని బడికి పంపిన తర్వాత మధ్యాహ్నం సముద్రం ఒడ్డుకు చేరుకుంటాం. ఒక్కోసారి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటే మాకు దిక్కుతోచదు. ఆయన వచ్చేంత వరకు ఎదురుచూస్తుంటాం. క్షేమంగా రావాలని మా కుల దైవాన్ని ప్రార్థిస్తుంటాం.

– రజిత, తూపిలిపాళెం

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన పులిచెర్ల సురేంద్రనగర్ వాసులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పులిచెర్ల సురేంద్రనగర్, మొరవపల్లెకు చెందిన పది కుటుంబాలు గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వీరందరూ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్, గోవర్ధన్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మంత్రి నివాసానికి వెళ్లి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారిలో ధనరాజ్, కుమార్, చినబాబు, కల్యాణ్, మురళి, రమేష్, మల్లికార్జున వారి కుటుంబీకులు పార్టీలో చేరారు. వీరందరికీ మంత్రి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు పోకల అశోక్‌కుమార్, మువ్వల నరసింహులు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

చిత్తూరు కలెక్టరేట్: ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు. గురువారం క్షేత్రస్థాయి అధికారులతో వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణయించిన గడువులోపు ఎన్నికల పనులు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయి నివేదికను ఈఆర్‌వో యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించి నివేదికలను కలెక్టరేట్‌కు పంపాలని సూచించారు. జిల్లాలో 42 వేల అభ్యంతరాలు వచ్చాయని, వాటన్నింటినీ పరిష్కరించాలని చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాలను పోలీసుల సహాయంతో సీజ్ చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌వో రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలన కోసం జగనన్నే రావాలి

శ్రీరంగరాజపురం : పేదపిల్లలు బతుకులు మారాలంటే, సంక్షేమ పథకాలు మళ్లీ అందుకోవాలంటే, జగనన్నే మళ్లీ సీఎం కావాలి అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని ముద్దికుప్పం పంచాయతీలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్నకు మేనిఫెస్టో అనేది ఓ బైబిల్, ఓ ఖురాన్, ఓ భగవద్గీత లాంటిందని చెప్పారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అదే చంద్రబాబు అధికారంలోకి రాగానే మేనిఫెస్టోని మాయం చేసి పెత్తందారులకు, తన సామాజిక వర్గానికి ప్రజాధనాన్ని దోచిపెట్టారని గుర్తు చేశారు. జగనన్న పేదల సంక్షేమానికి భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు మోసానికి, వెన్నుపోటుకు, అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ అయితే, జగనన్న నమ్మకానికి చిరునామా అని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలను బంగాళాఖాతంలో కలిపేసి, జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందాం అని పిలుపునిచ్చారు. అనంతరం ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే డిస్‌ప్లే బోర్డును ప్రారంభించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ సరిత, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, మండల కన్వీనర్ మణి, సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ సిద్ధయ్య తోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పది పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : పదవ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువు పొడిగించినట్లు డీఈవో విజయేంద్రరావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ వరకు ఉన్న గడువును ఈ నెల 20 వరకు పొడిగిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసినట్లు చెప్పారు. విద్యార్థుల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజును మాత్రమే వసూలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఫీజు వసూలు చేసినట్లు తమకు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు.

క్లుప్తంగా

నన్ను సంరక్షించిన వారికి ఆస్తి రాసిస్తా


బాధితుడు ఏసీ గోపాల్ రెడ్డి

పలమనేరు: తనను ఎవరైనా సంరక్షించేందుకు ఆసక్తి చూపితే తన ఆస్తిని వారికి రాసిచ్చేస్తానంటూ పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలం, ఆరిమాకులపల్లెకు చెందిన ఏసీ గోపాల్‌రెడ్డి(72) గురువారం స్థానిక ఆర్‌డీవో కార్యాలయం వద్ద విలేకరులను ఆశ్రయించాడు. ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితమే భార్య ఇద్దరు కొడుకులు తనను వదిలి బెంగళూరుకు వెళ్లిపోయారన్నారు. దీంతో గ్రామంలో ఉన్న భూమిని కౌలుకిచ్చి ఎలాగో బతుకు ఈడ్చుకొచ్చానని చెప్పారు. రెండేళ్లప్పుడు కంటి ఆపరేషన్ వికటించి కన్ను కనిపించకుండా పోయిందన్నారు. అప్పటి నుంచి నిస్సహాయ స్థితిలో కూరుకుపోయానన్నారు. తనకు గ్రామంలో 1.3 ఎకరాల భూమి ఉందని, ఎవరైనా సరే తనను వృద్ధాప్యంలో చూసుకుంటే వారికి తన భూమిని రాసిస్తానంటూ తెలిపారు. తన కుమారులు తనను సంరక్షించలేదని కోర్టుకెళ్లినా సమస్య ఇంకా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రీ రిపబ్లిక్ క్యాంపునకు పుత్తూరు విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

పుత్తూరు: సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న ప్రీ రిపబ్లిక్ క్యాంపునకు స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు టి.మునస్వామి, డి.వి.బాలాజీ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గురువారం అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్‌లో ఉత్తమ క్యాడెట్స్‌గా మునస్వామి, బాలాజీ ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్‌లో సికింద్రాబాద్‌లో జరి గే ప్రీ రిపబ్లిక్ క్యాంపులోనూ ఎంపికై జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా న్యూ ఢిల్లీలో జరిగే పరేడ్‌లో పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు సుజన, నరసింహులు, దేవకి, శంకరరావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

చిత్తూరు అర్బన్: ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. నగరంలోని రఘురాం కాలనీ చెందిన బాలిక(17) ఇంటర్ చదువుతోంది. తనకు పుట్టిన రోజు సందర్భంగా, స్నేహితులతోపాటు బయటకు వెళ్తొస్తానని చెప్పి తిరిగి రాలేదు. రాత్రి అయినా ఇంటికి రావడంతో తల్లిదండ్రులు బంధువుల ఇళ్లంతా గాలించారు. తల్లిదండ్రుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.


చిత్తూరు రామ్‌నగర్ కాలనీలో రాత్రి బస చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనిసవాసులు


పూతలపట్టు మండలంలో వై ఏపీ నీడ్స్ జగన్ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

జిల్లా వ్యాప్తంగా వై ఏపీ నీడ్స్ జగన్ ప్రారంభం

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పర్యటించారు. వై ఏపీ నీడ్స్ జగన్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు పంపిణీ చేశారు. సంక్షేమ డిస్‌ప్లే బోర్డులు ఆవిష్కరించారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నగరంలోని రెండు డివిజన్లలో పర్యటించి, ప్రజలతో మమేకమవుతూ అక్కడే రాత్రి బస చేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు బుక్‌లెట్లు ఆవిష్కరించారు. పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పెద్దపంజాణి మండలంలో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ జగనన్నను ఎందుకు గెలిపించుకోవాలో వివరించారు. రాత్రి ప్రజలతో కలిసి ముచ్చటించారు. ఆ తర్వాత అక్కడే బస చేశారు. నేటి నుంచి నిరంతరాయంగా ఈ కార్యక్రమం అన్ని నియోజకవర్గాల్లో కొనసాగనుంది.


పెద్దపంజాణి మండలంలో రాత్రి బస చేస్తున్న పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ

వేదకాల వైద్యం ఆయుర్వేదం



ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుత వైద్యం ఆయుర్వేదం. వేదాల కాలం నాటి ఈ వైద్య విధానం భారత్‌లో అత్యంత ప్రాచుర్యం పొందింది. క్షీరసాగర మథనం జరిగినప్పుడు లక్ష్మీదేవి, చంద్రుడు, ఇంద్రుడు, వాయుదేవుడితోపాటు భగవాన్ ధన్వంతరి ఆశ్వయిజ బహుళ త్రయోదశి నాడు ఆవిర్భవించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజునే ధన్వంతరి జయంతిని అనాదిగా జరుపుకుంటున్నారు. దీంతో నవంబర్ 10వ తేదీన ప్రభుత్వం జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యంపై ప్రత్యేక కథనం.


ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు (ఫైల్)

- దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసే వైద్య విధానం
- నేడు ఆయుర్వేద దినోత్సవం

చిత్తూరు రూరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 ఆయుర్వేద వైద్యశాలలు ఉన్నాయి. అందులో 4 ఎన్‌ఆర్‌హెచ్‌ఎం కింద పనిచేస్తున్నాయి. 21 డాక్టర్లు, 35 మంది సిబ్బంది పనిచేస్తున్నాయి. 30 రకాల ఆయుర్వేద మందులు ఉన్నాయి. మరో వంద రకాల మందులు సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ వైద్యశాలలకు నిత్యం 600 మంది వస్తుంటారు. ప్రధానంగా వృద్ధులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

పలు రకాల వ్యాధులకు చికిత్స

ప్రస్తుతం వస్తున్న అన్ని రకాల జబ్బులకు వేద కాలంలోనే చికిత్సలు ఉన్నట్లు ఆయుర్వేదం చెబుతుంది. ప్రస్తుత వైద్య విధానాన్ని ఎనిమిది విభాగాలు విభజించారు. ఇందులో కాయచికిత్స(జనరల్ మెడిసిన్), బాలచికిత్స (ప్రసూతి, స్త్రీరోగ, బాలరోగ)లకు సంబంధించింది. గ్రహ చికిత్స(వైరాలజీ-యాంటిబాయటిక్స్), ఉర్ధ్వ చికిత్స(తల, మెడ), శల్యచికిత్స(సర్జరీ), దంష్ట్ర(పాము, తేలు, పురుగులకు), జర చికిత్స(ముసలితనంలో వచ్చే రోగాలకు), రసాయన చికిత్స(ఇమ్యూనాలజీ) మంచి ఫలితాలిచ్చాయి.

పంచకర్మ ప్రసిద్ధి

ఆయుర్వేదంలో పంచకర్మ చికిత్స విధానం ఓ విశిష్ట చికిత్స పద్ధతి అని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. మందులకు లొంగని మొండి వ్యాధులకు పంచకర్మ ఒక అద్భుత చికిత్స. వ్యాధిని మూలం నుంచి తీసి వేయడానికి ఈ చికిత్స విధానం తోడ్పడుతుంది. ఇందులో ఉండే ఐదు పద్ధతులు ఇవే. స్నేహనము, స్వేదనము, వయనము, విరేచనము, వస్తి ఇందులో స్నేహనము, స్వేదనములను పూర్వ కర్మలు అంటారు. శరీరంలో ఉన్న మలినాలన్నింటినీ దారిలోకి తెచ్చుకోవడానికి ఉపయోగపడుతుంది. మిగతా మూడు నోటి ద్వారా, విరేచనం ద్వారా జబ్బులను తొలగించడానికి వేస్తారు.

తగ్గిన ఆదరణ

బ్రిటీషుల రాకతో భారతదేశంలో అల్లోపతి మందుల వాడకం పెరిగింది. ఆంగ్లేయుల సైనికులకు గాయాలైనప్పుడు వారికి త్వరగా నయమయ్యేందుకు ఇంగ్లీష్ మందులను ఉపయోగించారు. దీంతో మన దేశంలో ప్రజలు వారిలాగే త్వరగా నయం కావాలని రోజువారీ జబ్బులైన తలనొప్పి, జలుబు, జ్వరం తదితర వాటికి ఇంగ్లీష్ మందులను వినియోగిస్తున్నారు. ఈ విధంగా ఆంగ్లేయుల రాకతో ఆయుర్వేద వైద్యాన్ని భారతీయులకు అంటగట్టి బలవంతులను బలహీనులుగా మార్చారని పూర్వీకుల వాదన. అయితే అల్లోపతి మందులతో దుష్పరిణామాలు వస్తున్నట్లు శాస్త్రవేత్తలు వెలుగులోకి తేవడంతో ప్రజలు మళ్లీ ఆయుర్వేద వైద్యంపై ఆసక్తి చూపుతున్నారు.

ఆయుర్వేదంతో ఆయుష్



సూర్యోదయానికి ముందే నిద్రలేవాలి. సూర్యాస్తమయంలోగా భుజించడం పూర్తి కావాలి. పరిమితంగా తినాలి. శారీరకశ్రమ తప్పనిసరిగా ఉండాలి. ఇది ఆయుర్వేదం చెప్పే జీవన విధానం. ఈ తరహా జీవనశైలిని అనుసరిస్తే వీటిలో అత్యధిక శాతం జబ్బులు అసలు రాకుండానే నివారించవచ్చు. నైట్‌లైఫ్ బాగా పెరగడం వల్ల, నిద్రలేమి, విపరీతమైన ఒత్తిడి, తద్వారా హార్మోన్ల అసమతౌల్యం వంటివి రోగాలకు కారణమవుతున్నాయి. దీనిని వెంటనే సరిచేసుకోవాలి.

– శేఖర్‌రాజు, సీనియర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి, చిత్తూరు

అన్ని రోగాలకు మందులు

ఆయుర్వేదంలో అన్ని రోగాలకు మందులు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. సంతాన సాఫల్యత, ఆడ, మగ హార్మోన్ అసమానతలు, కడుపు నొప్పి, రొమ్ములో గడ్డలు, మెనోపాజ్ తదితర స్త్రీల వ్యాధులకు, బీపీ, సుగర్, కిడ్నీలో రాళ్లు, అసిడిటీ, గ్యాస్ట్రబుల్, అజీర్ణం, మలబద్ధత, పైల్స్, ఫిషర్స్, సయాటికా, నడుము నొప్పి, కీళ్ల వాతం, చిన్న పిల్లలకు, గర్భిణులకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా మందులు ఉన్నాయి. ప్రస్తుతం మనం ఉపయోగించే వంటకాల్లో ఎన్నో మూలికలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆవాలు, జీలకర్ర, మిరియాలు, ధనియాలు, ఇంగువా, శొంఠిలో ఎన్నో ఔషధ మూలికలు ఉన్నట్లు ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. వీటిని ఉపయోగించి ఒక్కో జబ్బుకు ఒక్కో రకం మూలికను ఉపయోగించి మందులను తయారు చేస్తున్నారు. రోగులు జబ్బు వచ్చిన తర్వాత మొదటి సారిగా ఆయుర్వేద వైద్యులను కలిస్తే ఉపయోగంగా ఉంటుంది. అయితే అల్లోపతి, హోమియోపతి ద్వారా చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోతే, అప్పుడు ఆయుర్వేదాన్ని ఆశ్రయిస్తున్నారు.

300 ఫోన్లు స్వాధీనం


బాధితులకు ఫోన్ అందజేస్తున్న ఏఎస్పీ సుధాకర్

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు శాఖ రూ.60 లక్షల విలువచేసే 300 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుంది. ఈ ఫోన్లను గురువారం నగరంలోని పోలీసు అతిథిగృహంలో బాధితులకు అందజేసింది. ఈ మేరకు అడిషనల్ ఎస్పీ సుధాకర్ మీడియాకు వివరాలు వెల్లడించారు. గత రెండు నెలల్లో వివిధ రాష్ట్రాల్లో 300 ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పోగొట్టుకున్న ఫోన్లను చాట్‌బాట్ ద్వారా రికవరీ చేస్తున్నట్లు వివరించారు. చాట్‌బాట్ బృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జమ్ము కశ్మీర్, రాజస్థాన్, ఢిల్లీ, కేరళ, బీహార్, పంజాబ్, వంటి ప్రాంతాల్లో తప్పిపోయిన ఫోన్లను కూడా పట్టుకుంటోందని వెల్లడించారు. ఈ బృందం సహకారంతో మూడు దశల్లో రూ.2.05 కోట్ల విలువ చేసే వెయ్యి ఫోన్లు రికవరీ చేశామన్నారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే 9440900004కు వాట్సాప్ చేస్తే చాలని చెప్పారు. బాధితుల వివరాలను అడిగి తెలుసుకుని రికవరీ చేయడంలో చాట్‌బాట్ బృందం చక్కగా పనిచేస్తోందన్నారు. ఈ ఫోన్లను రికవరీ చేయడానికి కృషి చేసిన సీఐ భాస్కర్, ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రావు, చాట్‌బాట్ సిబ్బంది బాపూజీ, శ్రీనివాసన్, రఘురామన్, టెక్నికల్ సిబ్బంది అనాలసిస్ వింగ్ ఇన్‌చార్జ్ దేవరాజును అభినందించారు. అనంతరం బాధితులకు ఫోన్లను అందించగా, వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు నింద్రలో జగనన్నకు చెబుదాం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న నింద్రలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ నగరి నియోజకవర్గం నింద్ర మండలం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించనున్నట్లు చెప్పారు.

విధుల్లో నిర్లక్ష్యంపై డీఈవో ఆగ్రహం


మధ్యాహ్న భోజన్నాన్ని పరిశీలిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

పూతలపట్టు: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు హెచ్చరించారు. మండలంలోని పోలవరం ఉన్నత పాఠశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. అందులో భాగంగా తరగతుల గదులను పరిశీలించారు. కొన్ని తరగతుల గదుల్లో లైట్లు, ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు బయట వరండాలో కూర్చొని చదవడం గమనించారు. లైట్లు, ఫ్యాన్లు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాష్‌ను ప్రశ్నించారు. ఆయన సరైన సమాధానాలు ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠ్యాంశాల్లో ప్రశ్నలను అడిగి విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్కూల్లోని పాత బెంచీలు ఎక్కడబడితే అక్కడ పడేసి ఉన్నారని మండిపడ్డారు. నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఏవిధంగా బోధించాలో ఉపాధ్యాయులకు తెలియజేశారు. సోషియల్ టీచర్ కుమారస్వామి విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా నోట్స్ రాయిస్తున్నారని పిల్లలు డీఈవోకు చెప్పారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన హెచ్‌ఎం సూర్యప్రకాష్‌తోపాటు సోషియల్ టీచర్ కుమారస్వామికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

గురుకుల ప్రిన్సిపల్ సస్పెన్షన్

ఓజిలి: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న గురులకు పాఠశాల ప్రిన్సిపల్‌ను గుంటూరు ఏపీఆర్‌ఈఐ సొసైటీ కార్యదర్శి ఆర్.నరసింహరావు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని చిలమానుచేను బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఏపీఆర్‌ఈఐ సొసైటీ కార్యదర్శితోపాటుగా మరో నలుగురు సిబ్బంది మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు ముమ్మరంగా తనిఖీలు చేశారు. ప్రిన్సిపల్ అనంతయ్య నిధులు దుర్వినియోగం చేస్తున్నట్లు, రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించడం లేదని ఫిర్యాదులు అందడంతో తనిఖీలు జరిగాయి. ప్రిన్సిపల్ గదిలో కాల్చి పడేసిన సిగరెట్లు అధిక మోతాదులో ఉండడాన్ని బృందం గుర్తించింది. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కొంతమందిని ఇటీవల తొలగించారు. ఈ వ్యవహారం కోర్టులో ఉన్నా, వారితోనే విధులు నిర్వహి స్తుండడం నిర్లక్ష్యానికి అద్దంపట్టింది. సిబ్బందికి గదులు కేటాయించే సమయంలో అనుమతులు తీసుకోకపోవడం, జూలై నెలలో విద్యార్థులకు బార్బర్ పనులు చేసినట్లు నిధులు మంజూరుకు బిల్లు పెట్టారు. విద్యార్థులతో చర్చించిన తర్వత ఆ నెలలో బార్బర్ చేత పని జరగలేదని స్పష్టం అయ్యింది. పాఠశాలలో నిధులు వినియోగానికి సంబంధించి రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించలేదని నిర్ధారణ అయ్యింది. విద్యార్థులు పట్ల ప్రిన్సిపల్ నిర్లక్ష్య వైఖరి భాద్యత రాహిత్యాన్ని చాటడడంతో సస్పెండ్ చేస్తూ నరసింహరావు ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీవైజయంతిలో దీపావళి ఆఫర్లు


నరేష్‌కు బహుమతి అందజేస్తున్న ఆర్ఎం కృష్ణాజీ, అధినేత రామిరెడ్డి

నెల్లూరు(బృందావనం): దీపావళి పండగ సందర్భంగా శ్రీవైజయంతి ఎలక్ట్రానిక్స్‌లో కస్టమర్లకు ప్రత్యేక ఆఫర్లు అందజేస్తున్నట్లు ఆ షోరూం అధినేతలు ఎల్ నిరంజన్‌రెడ్డి, ఎల్‌టీ రామిరెడ్డి తెలిపారు. నెల్లూరులోని వైజయంతి ఎలక్ట్రానిక్స్‌లో ఎల్‌జీ కంపెనీ రిఫ్రిజిరేటర్ కొనుగోలు చేసిన కస్టమర్ నరేష్ రూ.5 లక్షల విలువైన గృహోపకరణాలను గెలుపొందారు. గురువారం షోరూమ్‌లో నరేష్‌కు ఎల్‌జీ కంపెనీ రీజినల్ మేనేజర్ కృష్ణాజీ, బ్రాంచి మేనేజర్ రామమనోహర్ గృహోపకరణాలు అందజేశారు. నిరంజన్‌రెడ్డి, రామిరెడ్డి మాట్లాడుతూ హ్యాట్రిక్ ఆఫర్‌కింద ప్రతి కొనుగోలుపై స్క్రాచ్ కార్డు ద్వారా రూ.10వేలు వరకు క్యాష్‌బ్యాక్, బ్రాండెడ్ గృహోపకరణాలు అందజేస్తున్నామని తెలిపారు. బంపర్ లక్కీడ్రా ద్వారా బుల్లెట్, ఎలక్ట్రిక్ బైక్, ఐ ఫోన్ వంటి బహుమతులు అందజేస్తున్నామని వివరించారు. బజాజ్, హెచ్‌డీబీఐ, ఐడీఎఫ్‌సీ వంటి ఫైనాన్స్ కంపెనీల ద్వారా రూ.4 లక్షల వరకు ఈఎంఐ రుణం అందిస్తున్నామన్నారు. నెల్లూరు, కావలి, తిరుపతి, చిత్తూరు, మదనపల్లిలోని తమ షోరూమ్‌లలో ఈ ఆఫర్లు అందిస్తున్నామని తెలిపారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందామని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ సచివాలయంలో గురువారం సాయంత్రం వై ఏపీ నీడ్స్.జగన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. నిత్యం సచివాలయాల పరిధిలో ప్రజాప్రతినిధులు, గృహసారథులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి జగనన్న చేకూర్చిన లబ్ధిని వివరించనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాక గత ప్రభుత్వంలో ప్రజలు ఏమి కోల్పోయారో వివరిస్తూ గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి మధ్య తేడాలను ప్రజలకు వివరించాలన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి, నివాళులర్పించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ అనే బ్యానర్‌ను, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పిఎస్ నాగరాజు, ఎస్ఎ గౌస్, మండల కన్వీనర్ బాలగురునాథ్, మండల సచివాలయాల కన్వీనర్ కిషోర్, వైస్ ఎంపీపీ తమీమ్, సింగిల్‌విండో చైర్మన్‌లు శ్రీరాములు రెడ్డి, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, గోపిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కళ్లతో చూసినా లేదనడం విడ్డూరం


మాట్లాడుతున్న డైయింగ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు


స్పిన్నింగ్‌లో ఉన్న ప్లాంటును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ నేతల తీరుపై నగరి డైయింగ్ అసోసియేషన్ సభ్యుల ఆగ్రహం

నగరి : పట్టణంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధినీ కళ్లతో చూసిన బీజేపీ జిల్లా నాయకులు అసలు అభివృద్ధే లేదనడం విడ్డూరంగా ఉందని నగరి డైయింగ్ అసోసియేషన్ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరి పట్టణంలో గురువారం సమావేశమైన వారు మాట్లాడుతూ నగరికి విచ్చేసిన బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలకం ఈశ్వర్ ప్రసాద్ ముఖ్యమంత్రిపైనా, మంత్రి రోజాపైనా, నగరి అభివృద్ధిపైనా చేసిన విమర్శలన్నీ సత్యదూరమని వారు స్పష్టం చేశారు. నిర్వహణలో ఉన్న ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటును వారు ప్రత్యక్షంగా చూసినా అభివృద్ధి జరగలేదని బీజేపీ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎలా ఉన్నా బాగాలేదని చెప్పేద్దాం వారు ముందే నిర్ణయించుకుని నగరికి వచ్చినట్లు తెలుస్తోందని చెప్పారు. మహానేత వైఎస్సార్ పాలనలో ప్లాంటును నిర్మిస్తే ఆపై వచ్చిన ప్రభుత్వాల పాలనలో నిర్వహణకు నోచుకోక శిథిలావస్థకు చేరిందన్న విషయం అందరికీ తెలుసని చెప్పారు. ఈ రోజు మాట్లాడిన నోళ్లు ఆరోజు ఏమయ్యాయని ప్రశ్నించారు. మంత్రి ఆర్కేరోజా చూపిన ప్రత్యేక చొరవతోనే ప్లాంటు నేడు మళ్లీ యథా స్థితికి చేరిందని చెప్పారు. ప్లాంటుకున్న 2 కోట్ల విద్యుత్ బకాయిలను మున్సిపాలిటీ ద్వారా చెల్లించినట్లు వివరించారు. ఆ తరువాత నగరి డైయింగ్ అసోసియేషన్ సభ్యులకు నిర్వహణ బాధ్యతలను అప్పగించారని తెలిపారు. బీజేపీ నాయకులు నేత కార్మికులపై ప్రేమతోనో, నగరిపై అక్కరతోనూ ఇక్కడకు రాలేదని, మంత్రి రోజాపై అక్కసుతో మాత్రమే వచ్చారని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, అధ్యక్షులు ఏజీ మణిగండన్, ఉపాధ్యక్షులు పీఎస్ దేవరాజ్, ట్రెజరర్ టీజీబీ విశ్వనాధన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తం, బాబు, ఎంఆర్ బాలు తదితరులు పాల్గొన్నారు.